వార్తల్లో మనిషి



## ఛాయాచిత్ర కిరణం

**ఈతరానికి** ఓ ప్రత్యేకత ఉంది. చదువుతో పాటు ఏదో ఒక ఆసక్తిని ప్రవృత్తిగా మార్చుకోగల తెలివి అపారం. చదువు పూర్తయ్యాక ఆ ప్రవృత్తినే వృత్తిగా మార్చుకొనే ధైర్యమూ ఎక్కువే. అందుకు ఉదాహరణ చెన్నైకి చెందిన కిరణ్మయి వీరమణి. కిరణ్మయికి చిన్నప్పటి నుంచీ ఫొటోగ్రఫీ అంటే ఇష్టం. ఐదో తరగతిలోనే ఓ బర్త్‌డే పార్టీని కవర్ చేసింది. కాలేజీలో చేరాక ఫొటోగ్రఫీ క్లబ్ సభ్యురాలిగా తన కళకు మెరుగులు దిద్దుకుంది. హాస్టల్ జీవితం మొదలు పరిసరాల్లో కనిపించే పక్షుల వరకూ ప్రతి దృశ్యాన్నీ, సందర్భాన్నీ ఓ రంగుల కావ్యంగా మలచగలిగింది. గోథె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫొటోగ్రఫీ అనే సంస్థ శ్రీలంకలోని తమిళుల జీవితాలపై ఓ ప్రాజెక్ట్ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానించినప్పుడు... కిరణ్మయి తన అభ్యర్థన పంపింది. ఆమె ప్రతిభను గుర్తించి శ్రీలంకకు పంపారు ఎన్జీవో ప్రతినిధులు. సుదీర్ఘమైన అంతర్యుద్ధాన్ని తట్టుకుని నిలబడిన తమిళుల బతుకు కథల్ని తన కెమెరాలో బంధించింది కిరణ్మయి. ఆ తర్వాత కూడా భిన్నమైన ఇతివృత్తాలతో ప్రాజెక్టులు చేస్తున్నది.

Fashion



## ప్రణయ కావ్యం!

**న**వరసాలలో మేటి శృంగారమైతే.. శృంగారానికి పెద్దపీట వేసిన కావ్యం శ్రీనాథుడి నైషధం.'రతీ మన్మథుల విండ్లు రమణి కనుబొమలు' అంటూ కావ్యనాయికను వర్ణిస్తూ మహాకవి అన్న మాటలు 'ఈగల్' కథానాయిక కావ్యా థాపర్‌కు కూడా అతికినట్టు సరిపోతాయి. అలంకరణకు ఆత్మవిశ్వాసం తోడైనట్టు ఉంది కదూ తన ఆహార్యం.

సి.ఎం. ప్రవీణ్



'పాటిల్ కాకి' ఫుడ్ స్టార్టప్ విజయ గాథ ఆనంద్ మహీంద్రా లాంటి దిగ్గజాలకూ నచ్చింది. కారణం, ఆ వ్యాపారంలో బిజినెస్ మేనేజ్‌మెంట్ కంటే.. అమ్మతనమే ఎక్కువ. మార్కెటింగ్ వ్యూహాలతో పోలిస్తే ఆత్మీయ సేవలే అధికం. కాబట్టే, ముంబైకి చెందిన గీతా గోవింద్ పాటిల్ ఏటా కోట్ల రూపాయల టర్నోవర్ సాధిస్తున్నారు. ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలుస్తున్నారు.





# గీత గోవిందం!

**ఆమె** పేరు గీతా గోవింద్ పాటిల్. నడి వయసు తర్వాత 'పాటిల్ కాకి' పేరుతో ఫుడ్ స్టార్టప్ ప్రారంభించారు. 'అమ్మచేతి వంట' ఆ సంస్థ ట్యాగ్ లైన్. సరిగ్గా ఏడేండ్ల క్రితం.. అనుకోని పరిస్థితుల్లో ఆ అమ్మ ఫుడ్ ప్రెన్యూర్‌గా మారారు. ఇంటి నుంచే మహారాష్ట్ర సంప్రదాయ చిరుతిళ్లు, మిఠాయిలు తయారు చేసి అమ్మడం ప్రారంభించారు. ఆ తీయతీయని రుచులు ఓ చేదు అనుభవంలోంచి పుట్టుకొచ్చాయి. గీత భర్త గోవింద్ ఉద్యోగం పోవడంతో ఆ కుటుంబానికి ఆర్థిక కష్టాలు మొదలయ్యాయి. మరో కొలువు దొరకడం అసాధ్యమైంది. ఆ సంక్షోభ సమయంలో గీతా పాటిల్.. ఇంటి బాధ్యతలు తీసుకున్నారు. వంటను ఉపాధిగా ఎంచుకున్నారు. గీతమ్మ చేతి రుచి అమృతమే. అతిథి సేవల్లో ఆమెకు తిరుగులేదు. చెదరని చిరునవ్వు తన ప్రత్యేకత. ఐదువేల రూపాయల పెట్టుబడితో 2016లో చిన్నపాటి స్వగృహ ఫుడ్స్ ప్రారంభించారు గీత. మోదక్, పూరంపోలి (బొబ్బట్లు), చక్లీ, పోహె (అటుకులు), చివ్డా మొదలైనవి తయారు చేసి అమ్మసాగారు. జనానికి ఆ రుచి నచ్చేసింది. నిజానికి, ముంబై జీవితం అంటేనే.. గడియారం వెనకాలే పరుగులు తీయడం. ఆ ఉరుకులో పడిపోయి సంప్రదాయ రుచుల్ని మరిచిపోయారు మహానగర వాసులు. ఆ కమ్మదనాన్ని మళ్లీ జిహ్వకు పరిచయం చేశారు గీత. ఇక తిరుగేముంది? 'పాటిల్ కాకి' వ్యాపారం రూ.3.5 కోట్ల వార్షిక టర్నోవర్‌ను అధిగమించింది. ప్రస్తుతం, దాదాపు వందమంది మహిళలు ఆమె దగ్గర పనిచేస్తున్నారు. ఈ మధ్యే పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా కూడా గీతా పాటిల్ వీడియోను షేర్ చేశారు. ఆమె పట్టుదలను ప్రశంసించారు.

### అమ్మ చేతి వంట

గీత ముంబైలో పుట్టి పెరిగారు. తండ్రి ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసేవారు. పెళ్లి కూడా ముంబైవాసితోనే జరిగింది. గీత వంటకాలు అమ్మతనాన్ని గుర్తు చేస్తాయి. నిజానికి, ఆ పాకశాస్త్ర నైపుణ్యాన్ని తల్లి నుంచే వారసత్వంగా అందుకున్నారామె. గీత వాళ్లమ్మ రోజూ ఇరవై మందికి టిఫిన్లు, భోజనాలు వండి క్యారేజీలో సర్ది పంపేవారు. 'ఆ పనిలో అమ్మకు సాయం చేసేదాన్ని. దినుసుల్ని ఎలా నూరుకోవాలి, ఉప్పూకారం ఎంత వేయాలి.. అనేది అమ్మ ద్వారానే తెలుసుకున్నాను' అంటూ బాల్యాన్ని గుర్తుచేసుకుంటారామె. ప్రస్తుతం, గీతా పాటిల్ సంస్థకు పాతికవేలకు పైగా కస్టమర్లు ఉన్నారు. పుణె, థానే, నవీ ముంబై, ముంబై ప్రాంతాల్లో రోజూ వేలమంది 'పాటిల్ కాకి' చిరుతిళ్లు రుచి చూస్తున్నారు. 'క్షణం కూడా తీరిక ఉండటం లేదు. సమయం దొరికితే బంధుమిత్రులతో కాలక్షేపం చేస్తాను' అంటూ నవ్వేస్తారామె. లాక్‌డౌన్ సమయంలో ఆమె కుమారుడు వినీత్, అతని స్నేహితుడు దర్శిల్ రంగంలో దిగారు. సంప్రదాయ వ్యాపారానికి కార్పొరేట్ హంగులు తెచ్చారు. లాక్ డౌన్ సమయంలో రూ. 12 లక్షల వార్షిక ఆదాయం ఉన్న వ్యాపారాన్ని తాజాగా రూ. 3.4 కోట్లకు తీసుకొచ్చారు. 'ఏ వంట అయినా రుచిగా, శుచిగా చేస్తాను. ప్యాకింగ్‌లో పదార్థాలు చితికిపోకుండా అందించడమే మా విజయ రహస్యం' అంటారు గీత. కాబట్టే జనం వాటిని ఇష్టంగా కొంటున్నారు. మరింత ఇష్టంగా తింటున్నారు. ఇప్పుడు గీతా పాటిల్‌కు ఖరీదైన శాంతా క్రజ్ ప్రాంతంలో సొంత జాగా ఉంది. అక్కడ అత్యాధునిక హంగులతో ఓ కిచెన్ ఏర్పాటు చేయాలని ఆలోచన. ఆ పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయి.




> నేను పెద్దగా చదువుకోలేదు. లోకజ్ఞానమూ తక్కువే. కానీ కష్టాన్ని నమ్ముకున్నాను. అదే నన్ను నిలబెట్టింది. బాబు ఎదిగిరావడంతో వ్యాపారాన్ని విస్తరించగలిగాను. తోటి మహిళలకు నా సలహా ఒక్కటే.. ఆర్థిక స్వాతంత్ర్యం సాధించండి. మిమ్మల్ని మీరు నిరూపించుకోండి. సమాజంలో మీకంటూ ఓ స్థానం సంపాదించుకోండి. డబ్బు దానంతట అదే వస్తుంది.
>
> • గీతా గోవింద్ పాటిల్

... పాసికంటి శంకర్

## ఇడ్లీ, వడ.. ఓ క్రైమ్!

**అది** ముంబై సమీపంలోని విరార్. అక్కడో దక్షిణాది టిఫిన్ సెంటర్. కొన్నిరోజులుగా ఆ హోటల్‌కు నలభై యాభై ప్లేట్ల టిఫిన్ల కోసం ఆర్డర్ వస్తున్నది. ఎవరైనా, సంతోషించాల్సిన విషయమే ఇది. కానీ ఆర్డర్ అందుతున్న సమయమే అనుమానాస్పదం. సరిగ్గా తెల్లవారు జామున నాలుగు గంటలకు ఫోన్ వస్తుంది. అది కూడా బ్రిటిష్ కాలం నాటి పాడుబడిన ఓ బంగళా నుంచి. అర్జెంటుగా పాతిక ప్లేట్ల ఇడ్లీలు, ఇరవై వడలు పంపేయ్. చాయ్ వేడిగా ఉండాలి' అంటూ ఒకటికి పదిసార్లు చెప్పేవారు. అక్కడి వాతావరణం చూశాక డెలివరీ బాయ్‌కి అనుమానం వచ్చింది. హోటల్ యాజమాని చెవిన వేశాడు. అసలే పరిస్థితులు, బాగా లేవు కాబట్టి, ఆ సమాచారాన్ని



పోలీసులకు అందించాడా పెద్దాయన. అతని అనుమానం నిజమైంది. అదో ఆన్‌లైన్ ఫ్రాడ్ కాల్‌సెంటర్. ఇక్కడి నుంచే విదేశీయులను బురిడీ కొట్టించే కుతంత్రం సాగుతున్నది. ఒక ఆర్థిక సంస్థ పేరుతో ఆస్ట్రేలియా పౌరులకు ఫోన్లు చేసి బ్యాంక్ ఓటీపీ తెలుసుకుని.. నగదు కాజేయడమే ఆ ముఠా పని. ఎవరికీ అనుమానం రాకుండా చిమ్మచీకట్లో పని చేస్తున్నా, జీతాలన్నీ నగదు రూపంలో ఇస్తున్నా.. తెల్లవారు జామున ఇడ్లీ, వడ, చాయ్ ఆర్డర్లతో దొరికిపోయారు దొంగలు. బూత్ బంగ్లాకు అనుబంధంగా దేశవ్యాప్తంగా కాల్ సెంటర్లు ఉన్నట్టు పోలీసులకు వర్తమానం అందింది.

**నమస్తే మేడం. రజస్వల సమయంలో చప్పటి ఆహారం పెట్టాలని పెద్దలు చెబుతుంటారు. కారం కనుక తింటే.. భవిష్యత్తులో నెలసరి నొప్పి, ఇతర సమస్యలు తలెత్తుతాయా? మా అమ్మాయికి 14 ఏండ్లు. తన కడుపునొప్పికి కారణం.. రజస్వల అయినప్పుడు కారం తినడమేనా?**

**• ఓ పాఠకురాలు**

## నొప్పి అందుకేనా?

జిందగీ క్లినిక్



డాక్టర్ పి. బాలాంబ
సీనియర్ గైనకాలజిస్ట్

**ఇక్కడ** ముఖ్యమైన విషయం ఏమిటంటే... రజస్వల కావడానికి, ఆ సమయంలో తినే ఆహారానికి అసలు సంబంధం లేదు. కారాలు తినకూడదన్న నియమం అసలే లేదు. చక్కని పౌష్టికాహారాన్ని రుచిగా వండి పెట్టొచ్చు. మనం ఈ సందర్భంగా నువ్వులు, బెల్లంలాంటి క్యాల్షియం, ఐరన్ ఉండే పదార్థాల్ని పెడతాం. అది పిల్లలకు ఎంతో మంచిది. ఎందుకంటే పుష్పవతి అయిన ఆరునెలల దాకానే పిల్లలు ఎత్తు పెరుగుతారు. తర్వాత పెరుగుదల నెమ్మదిస్తుంది. అందుకే ఈ సమయంలో విటమిన్లు, మినరల్స్, ప్రొటీన్లు, పీచులు కలగలిపిన సంపూర్ణ పౌష్టికాహారాన్ని అందించడం ఎంతో ముఖ్యం. మంచి వ్యాయామమూ అవసరం. కాబట్టి మీ అమ్మాయి కడుపు నొప్పికి, ఆ సమయంలో తీసుకున్న ఆహారానికి ఎలాంటి సంబంధం లేదు. నొప్పి ఎక్కువగా ఉంటే డాక్టర్‌ను సంప్రదించండి. పరీక్షలు చేసి, తగిన సూచనలిస్తారు. హాట్‌ప్యాక్ లాంటివి పొట్టమీద పెడితే కూడా కొంత ఉపశమనం ఉంటుంది.

## అత్త ఉన్న కోడలు

**ఇంటిలోని** పోరు ఇంతింతగాదయా అన్నాడు వేమన. అది మగవారి బాధే అనుకోవడానికి లేదు. మగువల వేదన కూడా! ముఖ్యంగా అత్తాకోడళ్లు ఒకే ఇంట్లో ఉండాల్సి వచ్చినప్పుడు అనేక సమస్యలు. కోడలు వాటిని అధిగమించే మార్గాలివి..

- వ్యక్తిగత ఆరోపణలకు అస్సలు స్పందించకండి. మిమ్మల్ని మరింత గాయపరిచే అవకాశం ఇవ్వకుండా, అక్కడి నుంచి తప్పుకోండి.
- తల్లిని సమర్థించాలా, భార్యవైపు ఉండాలా అనేది భర్తకు పెద్ద సందిగ్ధం. తల్లి పట్ల కృతజ్ఞత, భార్య మీద ప్రేమ ఏదో ఒక వైపే నిలబడకుండా చేస్తాయి. ఆ సమయంలో, ఎవరో ఒకరిని ఎంచుకొని తీరాలి అంటూ బలవంతపెట్టకండి.
- అత్తమామలతో ఉన్న తగాదాలను చిన్నపిల్లల ముందు ప్రస్తావించవద్దు. ఆ ప్రభావం చిన్నారుల మనసుల మీద పడుతుంది. పిల్లలకు సహజంగానే కొంత అవగాహన ఉంటుంది కాబట్టి, మనం చెప్పకుండానే గ్రహించగలరు.
- తమకు చాలా అనుభవం ఉందని పెద్దల నమ్మకం. ఆ అభిప్రాయాన్ని కాదని అహాన్ని దెబ్బతీయడం ఎందుకు? నిర్ణయాలు తీసుకునేటప్పుడు, తనకో మాట చెప్పండి.
- అత్త ముందు భర్త గురించి చులకనగా మాట్లాడితే సమస్య మరింత తీవ్రం అవుతుంది. ఆ వాగ్బాణాలు అటు అత్తతోను, ఇటు భర్తతోనూ ఉన్న అనుబంధాన్ని దెబ్బతీస్తాయి.

వెనుకటి రోజుల్లో.. చదువులతో పాటు కళల్నీ బోధించేవారు. చదువులు అక్షరాన్ని ఇస్తే, కళలు జ్ఞానాన్ని ప్రసాదిస్తాయని నమ్మేవారు. విద్యలో నాణ్యత లోపించిన నేటి తరం పిల్లలకు.. కళల్ని పరిచయం చేసే బాధ్యత తీసుకున్నది ఓ విశ్రాంత ఉపాధ్యాయుల జంట.

## విశేష జీవితం



**పశ్చిమ** బెంగాల్‌కు చెందిన అవిక్ ఘోష్, ఆయన భార్య గార్గి మూడు దశాబ్దాలు ఉపాధ్యాయులుగా పనిచేశారు. శేష జీవితం విశేషంగా గడపాలని అనుకున్నారు. అంతేకానీ, అందరిలా మనవళ్లు, మనవరాళ్లతో కాలక్షేపం చేస్తూ కాలం వెళ్లదీయాలని ఆశపడలేదు. పిల్లల్లో సృజనాత్మకతకు పదును పెట్టడానికి 2019లో శాంతినికేతన్‌లో చిల్డ్రన్స్ థియేటర్ అకాడమీని స్థాపించారు. కొత్త ఆలోచనల్ని ప్రసాదించడంలో కళలు ఎంతగానో తోడ్పడతాయని గార్గి నమ్మకం. అకాడమీని స్థాపించిన కొద్ది కాలానికే దేశంలో లాక్‌డౌన్ విధించారు. దీనివల్ల కార్యకలాపాలకు ఆటంకం కలుగుతుందేమో అని ఆ దంపతులు ఆందోళన చెందారు. అయితే, విద్యార్థులు తమ నైపుణ్యాన్ని నిరూపించుకోవడానికి ఇదే సరైన సమయం అని భావించి ఆన్‌లైన్ వేదికగా ప్రదర్శనలు మొదలుపెట్టారు. ఒక చిన్న కథ అనుకొని దానికి అనుగుణంగా ఒకట్రెండు పాత్రలు సృష్టించి తామే నటించేవారు. చివర్లో జీవన నైపుణ్యాల్ని బోధించేవారు. ఇప్పటికీ అదే ఫార్ములా. కాకపోతే, నేరుగా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు ఘోష్, గార్గి. నటన, నృత్యం తదితర కళల వల్ల పిల్లలు, తల్లిదండ్రుల మధ్య బంధం మరింత బలోపేతం అవుతుందని, చిన్నారుల్లో నిజాయతీ, నిర్భీతి అంకురిస్తాయని అంటారు ఆ ఇద్దరూ. అవిక్ ఘోష్, గార్గి కోల్‌కతాలోని ఓల్డ్ ప్రెసిడెన్సీ కాలేజీలో చదువుకున్నారు. అక్కడే ప్రేమలో పడ్డారు. ఇద్దరూ ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డారు. పదవీ విరమణ తర్వాత కూడా ఇద్దరూ కలిసి సామాజిక బాధ్యత తీసుకున్నారు.

